

కథ

భీమరాజు వెంకటరమణ

# మన(సే) శత్రువు

*ఆరోజు ఆఫీసులో సరిగా పని చేయలేకపోయాను. రోజంతా శాంతి గురించే ఆలోచనలు. అశాంతిగానే సాయంత్రం వరకు గంటలు గడిచాయి. ఆఫీసు నుండి బయటకు వచ్చాను. ఇంటికి వెళ్ళబుద్ధి కావడం లేదు. ఎవరున్నారు అక్కడ ఎదురు చూసేవాళ్ళు?*

టాంక్‌బండ్ మీద కారు ప్రక్కకు ఆపాను. ఇంకా పూర్తిగా చీకటి పడలేదు. ఒక బెంచి మీద కూర్చున్నాను. హుసేన్‌సాగర్ మీద నుండి చల్లని హాయిగొలిపే గాలి వీస్తున్నది. కానీ అంతర్లీనంగా గాలితోపాటు కాస్త చెడు వాసన కూడా వస్తున్నది. ప్రస్తుతం నా మనసూ అంతే, నిర్మలంగా లేదు. మళ్ళీ ఆలోచనలు మొదలైనాయి. శాంతి నన్ను వదలి వెళ్ళి సరిగ్గా ఇరవైనాలుగు గంటలు అయింది. క్రితంరోజు అదే సమయానికి మా ఇద్దరి మధ్య అర్థంలేని ఘర్షణ. అయినా ఆమె నన్ను వదలి వెళ్ళి ఉండవలసింది కాదు.

రాత్రంతా నిద్రలేదు, పగలంతా ప్రశాంతత లేదు. బాగా అలసటగా ఉంది. నా ప్రక్క బెంచి మీద ఒక జంట కూర్చొని ఉన్నారు. ఒకరి చేతిలో ఒకరు చేయి వేసుకొని కబుర్లు చెప్పుకోవడం కనిపించింది. నాకు వాళ్ళు రాబోయే కాలానికి కాబోయే బలిపశువుల్లా కనబడుతున్నారు. వాళ్ళవైపు కాసేపు అలానే చూస్తున్నాను. ఒకప్పుడు నేను శాంతి కూడా ఇక్కడే ఇలాగే కూర్చొనేవాళ్ళం. కానీ సంవత్సరకాలంలో ఎంత మార్పు? అప్పుడు జంటగా సరదాగా, ఇప్పుడు ఒంటరిగా దిగులుగా.

నాకు అనిపించింది ఈ టాంక్‌బండ్‌కి ఎంత విచిత్రమైన చరిత్ర? ప్రేమని పెంచేందుకు ఈ బెంచీలు, అదే ప్రేమ విఫలమైతే మునిగేందుకు ముందున్న నీరు. రెండు ఆవేశాలకు ఆవాసం ఇక్కడే, ప్రక్క ప్రక్కనే. వైరాగ్యపు నవ్వు వచ్చింది. ఏమో! అందరూ విఫలమౌతారని ఎందుకు అనుకోవాలి? ప్రేమించి పెళ్ళి చేసుకొని సుఖంగా జీవించేవారు కూడా ఉండొచ్చు కదా! అయినా నేను ప్రేమలో విఫలం కాలేదు, పెళ్ళి కూడా చేసుకున్నాను. విఫలమైనా ఆత్మహత్య చేసుకోవాలని కొందరికి ఎందుకు అనిపిస్తుంది? ఆ మాట అనుకోగానే ఒళ్ళంతా గగుర్పాటు కలిగింది. ప్రస్తుతం నా మనసు మరి కాస్త వికలమైతే నేనూ అలానే ఆలోచిస్తానా? నో! అది సరైన ఆలోచన కాదు.

ప్రేమించుకుంటున్నవారు కానీ పెళ్ళి చేసుకున్నవారు కానీ, ప్రేమ విఫలమయిందనో, కాపురంలో కలత వచ్చిందనో ఒకరు ఆత్మహత్య చేసుకుంటే రెండవవాళ్ళు ఎంత బాధపడతారు? ఆ రెండు కుటుంబాలు ఎంతగా వేదన చెందుతాయి? అంతమందిని దుఃఖానికి గురిచేసి ఆత్మహత్య చేసుకునే వ్యక్తికి అసలు ప్రేమంటే అర్థం తెలియదేమో అనిపిస్తుంది. ఒక్క వ్యక్తికోసం ఎందరినో బాధపెట్టేది ప్రేమేనా? ఆలోచనలు ఎటో పోతున్నాయ్.

నేను శాంతి టాంక్‌బండ్ మీద కూర్చొని కబుర్లు చెప్పుకున్న రోజులు గుర్తుకొస్తున్నాయి. ఆమె ఎంతో సరదాగా మాట్లాడుతుంది. చిన్న జోక్ వేస్తేనే చాలాసేపు నవ్వుతుంది. అది నాకు బాగా నచ్చుతుంది. ఎప్పుడూ ఆమెను అలాగే ఉంచాలని చూసాను. కానీ ఎందుకు ఇలా జరిగింది?

పెళ్ళి చేసుకున్న సంవత్సరానికి ప్రేమ అంతా అయిపోయిందా? ప్రేమ పెళ్ళిళ్ళు అన్నీ ఇంతేనా? అసలు పెళ్ళికి ముందు మా మధ్య ఉన్నది ప్రేమేనా? ప్రేమే అయితే తను వెళ్ళిపోవడం ఎందుకు జరిగింది? నేనెలాంటి వాడినో, తనంటే నాకెంత ఇష్టమో తనకు తెలియదా? కాస్త అయినా సహనం చూపి ఉండకూడదా? అదే సహనం నేనూ చూపి ఉండొచ్చుకదా! ఇప్పుడు ఉన్న విచక్షణ అప్పుడు ఏమైయింది? అవును, అప్పుడు ఆ ఆవేశంలో వివేకంతో ఆలోచించే వ్యవధి ఏది? ఇక అహం అడ్డొస్తే సరైన సంభాషణకు అవకాశమేది?

ఆలోచనలతో మెదడు ఇంకా వేడెక్కుతున్నట్లు అనిపించింది. ఆ జంట ఇంకా కబుర్లు చెప్పుకుంటూనే ఉన్నారు. వాళ్ళను చూస్తూ ఇక అక్కడ ఉండలేకపోయాను. కారులో ఇంటికి బయలుదేరాను.

ఇంటి ముందు కారు ఆపాను. చీకటి రాక్షసి మా ఇంటిని నోట కరుచుకున్నట్లుగా ఉంది. దీపంపెట్టే దిక్కు లేదు కదా! కారులో కాసేపు అలాగే కూర్చున్నాను. శాంతి అమ్మా నాన్నలు ఉండే ఇల్లు ఒక గంట ప్రయాణపు దూరంలోనే ఉంది. కారు వెనక్కు త్రిప్పి వెళ్ళి ఆమెను తీసుకొస్తే? ఏమో! తను ఎలా అర్థం చేసుకుంటుందో!

కాసేపు వెళ్ళాలని కాసేపు వద్దని అంతర్మథనం, నాదీ తప్పు ఉందని నాకు తెలుసు, అయినా నా మనసు మాత్రం వెనక్కి లాగుతూనే ఉంది. చివరికి అదే గెలిచింది.

కారు దిగి చిన్నగా వెళ్ళి తలుపు తాళంతీసి లోపల లైట్ వేసాను. నిశ్శబ్దం రాజ్యమేలుతున్నది. మౌనంగా ఉన్న వస్తువులన్నీ నా వైపే గంభీరంగా చూస్తున్నట్లుగా అనిపిస్తున్నది. "ఇంతసేపూ హుసేన్ సాగర్ దగ్గర ఉండి అందులో దూకకుండా ఇంటికి ఎందుకు తిరిగి వచ్చావ్?" అని అడుగుతున్నట్లుగా ఉంది. మా సంవత్సర కాలపు కాపురానికి ప్రత్యక్ష సాక్షులు అవే.

ఫ్రిజ్‌లో నుంచి వాటర్ బాటిల్ తీసి పూర్తిగా త్రాగేసాను. ఆకలి లేదు. శారీరకంగా మానసికంగా అంతగా అలసిపోవడం ఎప్పుడూ జరగలేదు. నిరాశ నిస్పృహలు కూడా తోడైనాయి. తప్పు నాదీ ఉందని నా అంతరాత్మ చెబుతున్నా దిద్దుకోనివ్వదు మనసు.

తిన్నగా బెడ్‌రూమ్‌కి వెళ్ళి ఫ్యాన్ స్విచ్ ఆఫ్ చేసి బెడ్‌పై బద్ధకంగా వాలాను. సీలింగ్‌వైపు చూసాను. ఫ్యాన్ శరవేగంతో తిరుగుతున్నది. అది కూడా నా మీద సెగలు కక్కుతున్నది. "విష్ణుచక్రంలా నీ మీద పడి నిన్ను చంపినా పాపంలేదు" అన్నట్లుంది.

నిజమే! నన్ను ఏమిచేసినా పాపంలేదు. శాంతి అడిగినదానిలో తప్పేముంది? పెళ్ళి అయి సంవత్సరం అయింది కదా, ఇక పిల్లల గురించి ఆలోచించాలి అన్నది. నేను అప్పుడే పిల్లలు వద్దన్నాను, వాదన పెరిగింది, ఘర్షణగా మారింది, ఎప్పుడూ లేనంతగా విసుక్కున్నాను, తను వెళ్ళిపోయింది, నేను వెనక్కి పిలువలేదు.

చిన్న విషయం, పెద్ద వాదన, చివరికి మిగిలింది వేదన- ఇద్దరికి. అంతా నిముషాల్లో జరిగిపోయింది. మనసు సరిగా లేనప్పుడు వాదించుకోవడం మేమిద్దరం చేసిన తప్పు. ప్రైవసీ పేరుతో పెద్ద దిక్కు లేకుండా కొత్త కాపురం పెట్టడంవల్ల ఏదైనా చిన్న సమస్య వచ్చి పట్టుదలలకు పోతే సర్దిచెప్పేవారుండరు. ఉంటే ఇంతగా దారి తప్పే పరిస్థితి రాదేమో!

ఏది ఏమైనా శాంతి లేని ఇల్లు ఊహించలేకపోతున్నాను. అయినా! వాళ్ళ అమ్మా నాన్న తనకు నచ్చచెప్పి నా దగ్గరకు పంపొచ్చుగా? అసలు ఆమె వాళ్ళకి విషయం చెప్పిందో లేదో! నా ఆలోచనలు ఏదో విధంగా ఆమె చుట్టూనే తిరుగుతున్నాయి. తను కూడా నా గురించి ఆలోచిస్తున్నదా?

గత రాత్రిలాగే ఆ రాత్రి కూడా నిద్ర పట్టలేదు. తలలో నరాలు తెగిపోతాయని అనిపిస్తున్నది. మనసు మాత్రం ఆలోచించటం మానలేదు. తలనరాలు పగిలితే మటుకు దానికేమిటి? దాని పని అది కానిస్తూనే ఉంది.

మనసు అంటే ఆలోచనల పుట్ట అంటారు. అది పాములపుట్టగా మారి విషం చిమ్మితే అంతకు మించిన శత్రువు వేరే ఉంటుందా? మనసు వలన ఆనందంకంటే బాధే ఎక్కువగా కలుగుతున్నది, ఈ గందరగోళానికి నియంత్రణ లేదా? మనిషికి బుద్ధి జ్ఞానం వివేకం అన్నవి ఉంటాయి కదా! అవి ఎప్పుడు ఉపయోగపడతాయి? ఇంత జరిగినా పట్టించుకోవా? లేక పట్టించుకున్నందుకే ఇలా బాధ పడుతున్నానా?

నేనే ఈ ఆలోచనలతోటి ఇంత నరకం అనుభవిస్తుంటే అక్కడ శాంతి ఊరికనే ఉండగలదా? తనెంత బాధపడుతున్నదో! తట్టుకోలేక ఏదైనా అఘాయిత్యానికి పాల్పడితే? ఆ మాట అనుకోగానే గుండెల్లో దడ మొదలైయింది. నో! శాంతి అలా చెయ్యదు, ఆమె తెలివిగలది, ధైర్యవంతురాలు. తను లేకపోతే నేనేమైపోతానో అని ఊహించిందా? ట్యాంక్‌బండ్‌పై సాయంత్రం అనుకున్న మాటలు గుర్తుకొచ్చాయి.

ఏది ఏమైనా ఇంత వేదన అనుభవించేకంటే జీవిత భాగస్వామి పట్ల కాస్త సహనం చూపితే అహం అణిగి మనసు మనకు శత్రువుగా మారే ప్రమాదం తప్పుతుందిగా!

సమయం రాత్రి మూడు గంటలు దాటింది. బెడ్ మీద నుండి లేచి మళ్ళీ కడుపునిండా నీళ్ళు త్రాగాను. తూలి పడేట్లు ఉన్నా నిద్ర మాత్రం రావడం లేదు.

చిన్నగా వెళ్ళి వాకిలి తలుపు తీసాను. ఇంటి ముందున్న చిన్న తోటలోకి వెళ్ళాను. గోరింటాకు, నైట్ క్వీన్ చెట్లకు దగ్గరగా ఉన్న కేన్ చెయిర్‌లో కూర్చున్నాను. ఆ చెట్లు గాలికి తలలు ఆడిస్తున్నాయి. నైట్ క్వీన్ విరజిమ్ముతున్న సువాసన నా మనసుకు కలిగిన గాయానికి మందు రాస్తున్నట్లుగా ఉంది. కళ్ళలో నీళ్ళు తిరిగాయి, ఓదార్పుగా ఉంది, శాంతి పెంచిన చెట్లు కదా! ఒత్తిడి నీరసంగా మారుతున్నది, కళ్ళు బాగా అలసిపోయి మూతలు పడుతున్నాయి, కుర్చీలోనే వెనక్కు వాలాను. నిద్ర ఆవహించింది.

కాసేపటికే దూరంగా పక్షుల సవ్వడులు వినిపిస్తున్నాయి, ఎవరో నా భుజం మీద చల్లగా మృదువుగా నిమురుతున్నట్లు అనిపించింది. బలవంతంగా కళ్ళు తెరిచి వెనుకకు చూసాను, చెట్లనీడలో స్త్రీ రూపం, కళ్ళు పెద్దవి చేసి చూడటానికి ప్రయత్నించాను, ఆమె ముందుకు వంగి నా కళ్ళలోకి చూసింది, వీధి దీపపు కాంతిలో ఆమె కళ్ళు స్పష్టంగా కనపడ్డాయి, నా కళ్ళలోని అలసటే ఆమె కళ్ళలోనూ కనపడింది.

●

